నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

5 | నిజామాబాద్, గురువారం 19 డిసెంబర్ 2024 | NIZAMABAD


- అప్పులు తెచ్చి గ్రామాల్లో అభివృద్ధి పనులు
- ఏడాదిగా బిల్లులు ఇవ్వని కాంగ్రెస్ సర్కారు
- డబ్బుల కోసం సంవత్సరం నుంచీ ఎదురుచూపులు
- పోరాటానికి సిద్ధమైన మాజీ ప్రజాప్రతినిధులు
- నిరసనలను కూడా అనుమతించని అ'ప్రజా' ప్రభుత్వం
- ఎక్కడికక్కడ పోలీసులతో నిర్బంధిస్తున్న వైనం

మాజీ సర్పంచుల సతమతం



**కాంగ్రెస్ ప్రభుత్వ** నిర్లక్ష్య వైఖరితో మాజీ సర్పంచులు సతమతమవుతున్నారు. ఏడాది కాలంగా బిల్లులు చెల్లించక పోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తే డబ్బులు ఇవ్వకుండా సర్కారు సతాయిస్తుండడంపై మాజీ ప్రజాప్రతినిధులు ఆవేదన చెందుతున్నారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులో జాప్యం చేస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్కారుపై ఒత్తిడి తెచ్చేందుకు పోరాటానికి సిద్ధమవుతుంటే పోలీసులను పంపి అరెస్టు చేయిస్తుండడంపై మండిపడుతున్నారు. ప్రజా పాలన అంటే డబ్బులు ఇవ్వకుండా, నిరసన తెలుపనీయకుండా నిర్బంధించడమేనా? అని ప్రశ్నిస్తున్నారు.

–మోర్తాడ్, డిసెంబర్ 18



# బిల్లులు రాక.. మిత్తీలు కట్టలేక..

**పల్లెల అభివృద్ధి** కోసం మాజీ సర్పంచులు ఎంతో కష్టపడ్డారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, అదనపు గదులు, పైప్‌లైన్లు, బోర్ల మరమ్మతులు.. ఇలా ఎన్నో పనులు చేశారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా అప్పులు తెచ్చి మరీ గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సర్పంచులకు సమస్యలు మొదలయ్యాయి. సకాలంలో బిల్లులు రాక ఆర్థికంగా ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. పల్లెల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన డబ్బులు రాకపోవడంతో సతమతమవుతున్నారు. ఏడాది కాలంగా అప్పులకు వడ్డీలు కడుతూనే ఉన్నారు. ఇప్పటికే చాలా మంది మిత్తీలు కట్టలేని పరిస్థితికి చేరుకున్నారు. రేవంత్ సర్కారు ఇలాగే జాప్యం చేస్తే ఇల్లు, జాగా అమ్ముకోవడం తప్ప తమకు మరో గతి లేదని మాజీ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కేసీఆర్ హయాంలోనే ఠంచన్‌గా..**

కేసీఆర్ హయాంలో పల్లెలకు, ప్రజా ప్రతినిధులకూ సముచిత స్థానం దక్కింది. పల్లెప్రగతి పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి బాట పట్టించింది. వేలాది కోట్ల రూపాయలతో పచ్చదనం, పరిశుభ్రతకు పెద్దపీట వేసింది. ఊరూరా డ్రైనేజీలు, సీసీ రోడ్లు, వైకుంఠధామాలు, నర్సరీలు ఏర్పాటు చేశారు. రెండు నెలలకోసారి ఠంచన్‌గా గ్రామపంచాయతీ బిల్లులు చెల్లించారు. అలాగే, పంచాయతీ సిబ్బందికి, పారిశుద్ధ్య కార్మికులకు క్రమం తప్పకుండా వేతనాలు ఇచ్చారు. సర్పంచులకు, ఎంపీటీసీలకూ గౌరవ వేతనం ఇచ్చారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఏడాది కాలంగా బిల్లుల చెల్లింపులు నిలిచి పోయాయి. జీతాల కోసం పారిశుద్ధ్య కార్మికులు ఆందోళనలకు దిగుతున్నారు. పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచులు రోడ్డెక్కుతునారు.

### రూ.38 లక్షలు రావాలె..



బడాభీమ్‌గల్‌లో సీసీరోడ్లు, సీసీ డ్రైనేజీలు, బోర్ల మరమ్మతులు, ఇతర అభివృద్ధి పనులు చేసేందుకు మిత్తీకి పైసలు తెచ్చి ఖర్చు చేసిన. రూ.38లక్షల బిల్లులు రావాలె. ఏడాది అయిపోయింది. ప్రభుత్వం నుంచి రూపాయి అస్తలేదు. అప్పు తెచ్చి అభివృద్ధి పనులు చేస్తే చిప్ప చేతికొచ్చేటట్లు ఉన్నది. ఖర్చు పెట్టింది ప్రజల కోసమే కదా.. బిల్లులు ఇవ్వకుండా ప్రభుత్వం మమ్మల్ని గిట్ల ఇబ్బంది పెట్టుడు కరెక్టు కాదు. వెంటనే పెండింగ్ బకాయిలు చెల్లించాలే.

**- ఎర్రోళ్ల సంజీవ్, మాజీ సర్పంచ్, బడాభీమ్‌గల్**

### ఏడాది నుంచి బిల్లులు వస్తలేవు..



గ్రామాల్లో సీసీ రోడ్లు, పైప్‌లైన్ పనులు, బోర్ల మరమ్మతులు, డ్రైనేజీల నిర్మాణం ఇట్ల అన్నీ రకాల పనులు ప్రజల కోసం చేసినవే. విద్యార్థుల సౌకర్యం కోసం మన ఊరు–మన బడి పనులు చేసినం. దాదాపు రూ.40 లక్షల దాకా అప్పు తెచ్చి ఖర్చు పెట్టినం. ప్రజల కోసమే కదా ఇదంతా చేసింది. కానీ ప్రభుత్వమేమో ఏడాది నుంచి బిల్లులు ఇస్తలేదు. పైసలు రాక చాలా ఇబ్బంది అయితుంది. తాజా మాజీ సర్పంచుల బాధలను ప్రభుత్వం గుర్తించాలి. పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలి.

**- బోగ ధరణి, మాజీ సర్పంచ్, మోర్తాడ్**

### కేసీఆర్ ఉన్నప్పుడు మంచిగుండే..



కాంగ్రెస్ ప్రభుత్వం అచ్చినప్పటి నుంచీ బిల్లులు అస్తలేవు. వడ్డీకి తెచ్చి గ్రామంలో అభివృద్ధి పనులు చేసినం. కానీ పైసలు రాక మస్తే పరేషన్ అవుతున్నది. కేసీఆర్ ఉన్నప్పుడే మంచిగుండె. అప్పట్లో పంచాయతీలకు సంబంధించిన బిల్లులు రెండు నెలల్లోనే అస్తుండే. కానీ ఇప్పుడట్ల లేదు. ప్రజల కోసం ఖర్చు పెట్టిన డబ్బులను ఇయ్యకుండా సతాయించుడు మంచిగ లేదు. ప్రభుత్వం వెంటనే బిల్లులు మంజూరు చెయ్యాలే. డబ్బుల కోసం పోరాటం చేద్దామంటే పోలీసులతోని అరెస్టు చేయిస్తుండ్రు. ఏం జెయ్యాల్నో ఏమో అర్థమైతలేదు.

**- పత్తిరెడ్డి ప్రకాశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్, తడ్‌పాకల్**

### రూ.కోట్లల్లో బకాయిలు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు సంబంధించి మాజీ సర్పంచులకు ప్రభుత్వం రూ.కోట్లల్లో బకాయిలు చెల్లించాల్సి ఉంది. కేసీఆర్ హయాంలో సకాలంలో బిల్లులు రావడంతో ప్రజాప్రతినిధులంతా అప్పులు తెచ్చి మరీ గ్రామాల అభివృద్ధి కోసం ఖర్చు పెట్టారు. కానీ కాంగ్రెస్ వచ్చాక కథ మారింది. బిల్లులు పెండింగ్‌లో పడ్డాయి. ఒక్క బాల్కొండ నియోజకవర్గంలోనే ఒక్కో మాజీ సర్పంచ్‌కు రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల దాకా రావాల్సి ఉంది. ఏడాది కాలంగా డబ్బులు రాకపోవడంతో వారంతా దిగులు చెందుతున్నారు. వడ్డీలు కట్టడానికే పైసలు లేకపోవడంతో సర్కారుపై ఉద్యమానికి సిద్ధమయ్యారు. కానీ ప్రభుత్వమేమో పోలీసులను దింపి ముందస్తు పేరుతో నిర్బంధిస్తున్నది. అభివృద్ధి పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోతే తాము పనులు చేశామని, కానీ ప్రభుత్వం ఇలా వేధించడం సరికాదని మాజీ సర్పంచులు వాపోతున్నారు. వెంటనే బిల్లులు మంజూరు చేయాలని, లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

### వడ్డీకి తెచ్చి పనులు చేయించిన..



అప్పులు తెచ్చి పనులు జేసినం. ఏడాది దాటిపోయింది. ఇప్పుడు వడ్డీ కూడా కట్టలేని పరిస్థితి ఏర్పడింది. స్కూల్‌లో టాయిలెట్లు గట్టిన. జీపీ బిల్డింగ్ కట్టిన. వరద కాలువ పనులను చేసిన. రూ.17 లక్షల బిల్లులు రావాలే. ఏడాది నుంచి ఒక్క రూపాయీ కూడా ప్రభుత్వం ఇయ్యకపాయే. వడ్డీ ఎట్ల గట్టాలే, అసలు ఎట్ల తెంపాలే అర్థమైతలేదు. ప్రభుత్వం ఇప్పుడన్న మాబాధలను గుర్తించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలే.


**- గడ్డం చిన్నారెడ్డి, తాజా మాజీ సర్పంచ్, తిమ్మాపూర్**

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

# మహిళా రైతుకు అన్యాయంపై విచారణ

- నమస్తే తెలంగాణ కథనానికి స్పందించిన డీఏవో
- వడ్ల డబ్బులు రుణం కింద కొట్టేసుకున్న ఉదంతంపై ఆరా
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్న బాధితురాలు

ధర్పల్లి, డిసెంబర్ 18: వడ్ల డబ్బులను పంట రుణం కింద కొట్టేసుకున్న ఉదంతంపై వ్యవసాయ అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. బాధిత రైతుతో పాటు బ్యాంకర్లను విచారించారు. ధర్పల్లి మండలం సల్లగరిగె గ్రామానికి చెందిన మహిళా రైత గంగాజమునకు జరిగిన అన్యాయంపై 'నమస్తే తెలంగాణ' బుధవారం 'మాఫీ రాలేదు.. బ్యాంకు ఊరుకోలేదు' శీర్షికన ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఆమెకు రుణమాఫీ కాకపోవడం, వడ్ల డబ్బులను చెప్పాపెట్టకుండా బ్యాంకర్లు రుణం కింద కొట్టేసుకున్న ఉదంతాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ కథనంపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించారు. ఏం జరిగిందో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని డీఏవో వాజిద్ హుస్సేన్ ధర్పల్లి ఏవో వెంకటేశ్‌ను ఆదేశించారు. దీంతో ఏవో బుధవారం బాధిత రైతు నుంచి వివరాలు సేకరించారు. అలాగే, దుబ్బాకలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుకు వెళ్లి విచారణ జరిపారు. రైతు రుణానికి సంబంధించిన స్టేట్‌మెంట్ ఇవ్వాలని అడిగితే, సదరు రైతు వస్తేనే ఇస్తామని బ్యాంకర్లు చెప్పారు. దీంతో గంగాజమున బ్యాంకు వెళ్లి స్టేట్‌మెంట్ తీసుకుని ఏవోకు అందజేశారు. అనంతరం బ్యాంకు సిబ్బందితో మాట్లాడిన ఏవో.. వడ్ల డబ్బులను పంట రుణాల కింద పట్టుకోవద్దని చెప్పినా ఎందుకు పట్టుకుంటున్నారని ప్రశ్నించారు. అవసరమైతే వడ్డీ డబ్బులు కట్టించుకుని క్రాప్‌లోన్ రెన్యూవల్ చేయించుకోవాలని, రుణమాఫీ డబ్బులను ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. రైతులకు చెప్పకుండా డబ్బులు ఎలా కట్ చేసుకుంటారని ప్రశ్నించారు. అయితే, బ్యాంకు మేనేజర్ లీవ్‌లో ఉన్నాడని, గురువారం రావాలని క్యాషియర్ చెప్పడంతో ఏవో వెనుదిగారు. మరోవైపు, రుణమాఫీ విషయంలో జరిగిన అన్యాయంపై, సమాచారం ఇవ్వకుండా డబ్బులు కట్ చేసుకున్న బ్యాంకర్లపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని బాధిత రైతు తెలిపారు.



మాఫీ రాలేదు..
బ్యాంకు ఊరుకోలేదు

డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తి

# మద్యం మత్తులో వీరంగం

- ఠాణాకు తరలించిన పోలీసులు
- ఆత్మహత్య చేసుకుంటానని చెట్టెక్కిన నిందితుడు
- పైనుంచి కింద పడడంతో గాయాలు
- తాడ్వాయి మండల కేంద్రంలో ఘటన



మద్యం మత్తులో చెట్టు పైకెక్కిన గంగాధర్

లింగంపేట(తాడ్వాయి), డిసెంబర్ 18: మద్యం మత్తులో ఓ వ్యక్తి వీరంగం సృష్టించాడు. తాగి బండి నడుపుతున్న అతడిని పోలీసులు ఠాణాకు తరలిస్తే ఆత్మహత్య చేసుకుంటానంటూ చెట్టెక్కాడు. ఈ క్రమంలో పైనుంచి కిందపడడంతో గాయపడిన కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు బుధవారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా, మండల కేంద్రానికి చెందిన కీసరి గంగాధర్ తన వాహనంపై అటువైపు వచ్చాడు. పోలీసులు అతడిని ఆపి బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించగా, మద్యం సేవించినట్లు తేలింది. దీంతో వాహనంతో పాటు అతడిని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న అతను ఠాణా ఆవరణలో ఉన్న చెట్టు పైకి ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించాడు. దీంతో పోలీసులు ముందుజాగ్రత్తగా చెట్టు కింద వల ఏర్పాటు చేయడంతో పాటు కుటుంబ సభ్యులను పిలిపించారు. వారు వచ్చి ఎంత నచ్చజెప్పినా వినని గంగాధర్ చిటారు కొమ్మలపైకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు ఎంత ప్రయత్నించినా దిగకపోగా, తన వద్ద ఉన్న మద్యాన్ని తాగుతూ కూర్చున్నాడు. ఈ క్రమంలో అదుపు తప్పి చెట్టు కింద ఏర్పాటు చేసిన వలలో పడ్డాడు. అయినప్పటికీ అతడికి గాయాలు కావడంతో పోలీసులు కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

# వీవోఏలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

## శాసనమండలిలో ఎమ్మెల్సీ కవిత



ఐకేపీలో పని చేస్తున్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ల(వీవోఏ)కు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎమ్మెల్సీ కవిత ప్రభుత్వానికి సూచించారు. శాసనమండలిలో ఆమె బుధవారం మాట్లాడుతూ.. వీవోఏల సమస్యలను లేవనెత్తారు. కేసీఆర్ హయాంలో వారికి పలు దఫాలుగా వేతనాలు పెంచామని చెప్పారు. ప్రస్తుతం వీవోఏలపై పనిభారం తీవ్రంగా ఉందన్న కవిత.. ప్రభుత్వం వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. వేతనాలను రూ.26 వేలు చేస్తామని చెప్పారని, ఆ మాట నిలబెట్టుకోవాలని సూచించారు. వీవోఏలకు సీసీలుగా ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. అలాగే, ప్రతి గ్రామంలో మహిళాసంఘ భవనం నిర్మించాలని, ల్యాప్‌టాప్‌లు ఇవ్వాలని వీవోఏలు కోరుతున్నారని, వాటిని పరిశీలించాలని ప్రభుత్వానికి సూచించారు.

### విమర్శలను తిప్పికొట్టిన వేముల



సిరిసిల్ల–కామారెడ్డి–ఎల్లారెడ్డి జాతీయ రహదారి నిర్మాణంలో ప్రభుత్వం చేసిన విమర్శలను మాజీ మంత్రి వేముల బుధవారం అసెంబ్లీలో తిప్పికొట్టారు. ఈ రహదారిని నేషనల్ హైవేగా మార్చాలని తమ హయాంలోనే ప్రతిపాదనలు పంపించామని, కేంద్రం నుంచి సూత్రప్రాయ అనుమతి లభించిందన్నారు. అలైన్‌మెంట్ రూపొందించి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)కు పంపించామని చెప్పారు. కానీ, అక్కడి నుంచి అప్రూవల్ రాకపోవడంతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించలేదని వివరించారు.



ఆటోలో అసెంబ్లీకి..

**ఆటోడ్రైవర్ల సమస్యలను** పరిష్కరించాలని కోరుతూ మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి బుధవారం ఆటోలో ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి అసెంబ్లీకి వెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించకుంటే ఆటో కార్మికులతో కలిసి ధర్నాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

–వేల్పూర్, డిసెంబర్ 18



### హాస్టల్‌లో కన్నీటి కష్టాలు

**ఎల్లారెడ్డిలోని** బీసీ బాలికల వసతిగృహానికి నీటి సరఫరా నిలిచి పోయింది. మిషన్ భగీరథ నీటితో పాటు నల్లాలు రాకపోవడంతో ఈ పరిస్థితి దాపురించింది. నీళ్లు రాకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం వేళ చల్లని చలిలో హాస్టల్ బయటి నుంచి బకెట్లలో నీటిని తెచ్చుకుంటున్నారు.

– ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 18

# కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

- ఠాణాలో నిందితుడి ఆత్మహత్య కేసు
- కొనసాగుతున్న జ్యుడీషియల్ ఎంక్వైరీ

రెంజల్, డిసెంబర్ 18: రెంజల్ పోలీసుస్టేషన్‌లో పని చేస్తున్న ఓ కానిస్టేబుల్‌పై వేటు పడింది. లైంగిక దాడి కేసులో అదుపులోకి తీసుకున్న నిందితుడు ఠాణాలోనే ఆత్మహత్య చేసుకున్న ఉదంతంలోనే అతడిని సస్పెండ్ చేసినట్లు తెలిసింది. పోలీసుల నిర్లక్ష్యం కారణంగా ఈ ఘటన చోటు చేసుకున్నట్లు గుర్తించిన ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు పోలీసు అధికారి ఒకరు తెలిపారు. అత్యాచార కేసు నిందితుడికి బలమైన గాయాలు కావడంతో ఈ నెల 12వ తేదీన జిల్లా కేంద్ర దవాఖానలో వైద్యం చేయించారు. తర్వాతి రోజు (13వ తేదీ) తెల్లవారుజామున అతడిని రెంజల్ పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి విచారించారు. అనంతరం వాచ్ డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్‌కు అప్పగించారు. అయితే, రాత్రి సమయంలో వాచ్ డ్యూటీలో ఉన్న సదరు కానిస్టేబుల్ నిద్రకు ఉపక్రమించడంతో నిందితుడు ఠాణాలోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు అంతర్గత విచారణలో బయట పడడంతో సదరు కానిస్టేబుల్‌పై ఉన్నతాధికారులు వేటు వేశారు. మరోవైపు, ఠాణాలో ఆత్మహత్య ఘటనపై జ్యుడీషియల్ ఎంక్వైరీ జరుగుతుందని, మిగతా వారిపైనా శాఖాపరమైన చర్యలు ఉంటాయని పోలీసు అధికారి ఒకరు 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు.